
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 కర్నూలు జిల్లా వార్తలు
గురువారం 16 మే 2024



ఎవరికి అనుకూలం





ఓటు వేయడానికి క్యూలైన్‌లో నిల్చున్న ఓటర్లు (ఫైల్)

కర్నూలు, మే 15 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక సమరం ముగిసింది. పోలింగ్ పూర్తయింది. ఓటర్లు తమ తీర్పు చెప్పేశారు. ఆ నిర్ణయం ఎలా ఉంటుందనే విషయంపైనే సస్పెన్స్ కొనసాగుతోంది. ఈ ఉత్కంఠకు తెర పడాలంటే జూన్ 4 వరకు ఆగాల్సిందే..! పల్లె, పట్నాలు తేడా లేకుండా అంతటా ఒకటే చర్చ.. ప్రభుత్వం ఏర్పాటు చేసేది ఎవరు.. ఐదేళ్ల జగన్ పాలనకు ప్రజలు చరమ గీతం పాడుతారా.. జన రాజ్యం కోసం చంద్రబాబుకు పట్టం కడతారా.. వంటి అంశాలపై జోరుగా చర్చలు సాగుతున్నాయి. జిల్లాలో 2019 ఎన్నికల్లో పోలైన ఓట్లతో పోలిస్తే ఈ ఎన్నికల్లో 1.72 లక్షల మంది అధికంగా ఓటు వేశారు. వీరిలో ముప్పాతిక శాతం మంది కొత్తగా ఓటు హక్కు పొందిన యువతీ యువకులు, ఉద్యోగులే ఉన్నారని అంచనా. వీరు కూటమి వైపు మొగ్గు చూపారని పలువురు పేర్కొంటున్నారు. ఎవరి అంచనాలు ఎలా ఉన్నా.. ఓటరు తీర్పు ఎవరికి అనుకూలమో జూన్ 4న తెలుస్తుంది.

- గత ఎన్నికల కంటే 1.72 లక్షల ఓట్లు అధికం
- ఓటు వేసిన వారిలో యువకులు, ఉద్యోగులే ఎక్కువ
- కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరులో పెరిగిన పోలింగ్
- ఏ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందో..
- జోరుగా సాగుతున్న చర్చలు
- కూటమికి మొగ్గు ఉందంటున్న విశ్లేషకులు

జిల్లాలో కర్నూలు లోక్‌సభ స్థానంతోపాటు కర్నూలు, కోడుమూరు (ఎస్సీ), ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ, పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గాలకు సోమవారం (13న) పోలింగ్ ముగిసింది. 20,54,563 మంది ఓటర్లు ఉంటే.. 15,70,007 మంది ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి తమ స్పష్టమైన తీర్పు ఇచ్చారు. ఆ నిర్ణయం ఈవీఎం యంత్రాలలో నిక్షిప్తమైంది. రాయలసీమ యూనివర్సిటీలో పారా మిలటరీ మూడంచెల భద్రత మధ్య స్ట్రాంగ్ రూంల్లో ఈవీఎంలు భద్రంగా ఉంచారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. నాటి నుంచి పార్టీ టికెట్ రేసులో అధినేతల మనసు గెలుచుకోవడానికి.. టికెట్ ఖరారు అయ్యాక ఓటర్ల ఆకట్టుకోవడానికి కాళ్లకు చక్రాలు కట్టుకొని తిరిగారు. సోమవారం పోలింగ్ ముగియడంతో బరిలో తలపడిన అభ్యర్థులు, వారికి మద్దతుగా సై అన్న లీడర్లు, ద్వితీయ శ్రేణి నాయకులు, కీలకమైన కార్యకర్తలు రిలాక్స్ అయ్యారు. బుధవారం పోలింగ్ కేంద్రాలు వారిగా వచ్చిన పోలింగ్ నమోదు వివరాలను ముందు పెట్టుకొని గెలుపుపై అంచనాలు వేస్తున్నారు. టీడీపీ కూటమి, వైసీపీ ఇరు పార్టీలు తామే గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నా.. 2019 ఎన్నికల్లో పోలైన ఓట్లతో పోలిస్తే తాజా ఎన్నికల్లో 1.72 లక్షల మంది ఓటర్లు అదనంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదే క్రమంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ 86 శాతం దాటింది. సర్వేలు, పోలింగ్ సరళిని పరిశీలిస్తే ఏ అభ్యర్థిగా కూడా ఐదు వేల నుంచి 15 వేలకు మించి మెజార్టీతో గెలిచే అవకాశాలు లేవు. పెరిగిన ఓటర్లు ఎవరికి అనుకూలంగా ఓటు వేశారు..? ఇదే జిల్లా అంతటా ప్రధాన చర్చగా మారింది.

● గతం కంటే పెరిగిన పోలింగ్

పల్లె, పట్నాల్లో పోలింగ్ కేంద్రాలకు ఓటెత్తారు. క్యూలైన్లలో గంటల తరబడి నిల్చొని ఓటు వేశారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు సహజంగానే ప్రధాన ప్రతిపక్షమైన టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికే వెళ్తుంది. అయితే.. 18-19 ఏళ్ల యువ ఓటర్లు 65,067 మంది ఉన్నారు. తొలిసారి ఓటు వేయాలనే ఆసక్తితో.. గుంటూరు, విజయవాడ, హైదరాబాదు ప్రాంతాల్లో చదువుకుంటున్న యువత, బెంగళూరు వంటి ప్రాంతాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న యువత స్వగ్రామాలకు వచ్చి 85-90 శాతం తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకుంది. 2019 ఎన్నికల్లో జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాల్లో 13,97,490 మంది ఓటు వేస్తే.. తాజా ఎన్నికల్లో 13న పోలింగ్ రోజు 15,70,007 మంది ఓటు వేశారు. అంటే.. 1,72,517 మంది అధికంగా ఓటు వేశారు. వీరిలో యువత, ఉద్యోగ, వ్యాపార వర్గాలే ఎక్కువ శాతం ఉన్నారని, వారంతా మెజార్టీగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా టీడీపీ కూటమికి అనుకూలంగా ఓటు వేసి ఉంటారని రాజకీయ విశ్లేషకుల అంచనా. అలాగే.. గత ఎన్నికల్లో మొత్తం ఓటర్లు 18,60,285 మంది ఉంటే.. ఈ ఎన్నికల్లో 20,54,563 మంది ఉన్నారు. అంటే 1,95,278 మంది ఓటర్లు పెరిగారు. కొత్తగా నమోదైన ఓటర్లలో 87 శాతం ఓటు వేయడం కొసమెరుపు.

● టీడీపీ కూటమి వైపే ఉద్యోగులు:

ఉద్యోగ వ్యతిరేక ప్రభుత్వంగా జగన్ ప్రభుత్వానికి ముద్ర పడింది. దీంతో వైసీపీ ప్రభుత్వంపై ఉద్యోగ వర్గాలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నాయి. ఆ కసితోనే పోస్టల్ బ్యాలెంట్ ఓటింగ్‌కు పోటెత్తారు. రికార్డు స్థాయిలో 91.30 శాతం ఓటింగ్ పోస్టల్ ఓటింగ్ నమోదైంది. జిల్లాలో 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం 22,615 మంది దరఖాస్తు చేసుకోగా 19,344 మంది అర్హత కలిగిన పీబీ ఓటర్లను గుర్తించారు. వీరికి ఓటేసేందుకు ఈ నెల 6,7,8,9వ తేదీలలో అవకాశం కల్పించారు. 17,661 మంది ఉద్యోగులు వివిధ ప్రాంతాల నుంచి తమ సొంత నియోజకవర్గాలకు వెళ్లి క్యూలో నిల్చొని ఓటు వేశారంటే.. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత స్పష్టం అర్థమవుతోందని అంటున్నారు. పోస్టల్ ఓటేసిన ఉద్యోగుల్లో 85 శాతం ప్రభుత్వానికి వ్యతిరేకంగా వేసి ఉంటారని రాజకీయ విశ్లేషకులే కాదు.. ఉద్యోగ సంఘాల నాయకులు కూడా అంటున్నారు.

● ఇల్లు దాటిన ఓటర్లు

ఓటేసేందుకు నగర, పట్టణ వాసులు ఆసక్తి చూపారు. గతంలో ఇల్లు దాటని నగర ఓటర్లు ఈ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాలకు చేరుకొని క్యూలో నిల్చొని ఓటు వేయడం మార్పుకు సంకేతమని స్పష్టమవుతోంది. కర్నూలు నగరంలో ఉద్యోగులు, యువత, వ్యాపార వర్గాలు అధికంగా ఉండే వెంకటరమణ కాలనీ, అశోక్ నగర్, ఎస్‌ఆర్ పేట, ఎ. క్యాంప్, బీ క్యాంప్.. వంటి ప్రాంతాల్లో గత ఎన్నికల్లో 35-40 శాతం కూడా పోలింగ్ నమోదు కాలేదు. ఈ ఎన్నికల్లో 55 శాతం వరకు పోలయ్యాయి. అదే క్రమంలో ఆదోని పట్టణంలో ఎస్కేడీ కాలనీ, ఎన్జీఓ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీల్లో గత ఎన్నికల్లో ఏనాడు 45 శాతం పోలింగ్ దాటలేదు. 13న జరిగిన పోలింగ్ రోజున 55-60 శాతానికి పైగా పోలింగ్ నమోదు కావడం కొసమెరుపు. పాణ్యం నియోజకవర్గంలోని కర్నూలు అర్బన్ 16 వార్డుల్లో ఉద్యోగులు, యువత, వాప్యార వర్గాలు అధికంగా ఉండే వార్డులు, ఎమ్మిగనూరు పట్టణంలో కూడా ఆ వర్గాలు ఉన్న పాంతాల్లో పోలింగ్ శాతం గణనీయంగా పెరిగింది. ఇది మార్పుకే సంకేతమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

● నాడు-నేడు పోలైన ఓట్ల వివరాలు

నియోజకవర్గం	2019	2024	తేడా
కర్నూలు	1,54,063	1,74,973	20,910
పత్తికొండ	1,73,429	1,90,009	16,580
కోడుమూరు(ఎస్సీ)	1,71,843	1,95,181	23,338
ఎమ్మిగనూరు	1,79,893	2,03,086	23,193
మంత్రాలయం	1,58,915	1,75,667	20,752
ఆదోని	1,56,837	1,75,064	18,227
ఆలూరు	1,88,196	2,09,092	20,896
పాణ్యం	2,14,314	2,46,935	30,621
మొత్తం	13,97,490	15,70,007	1,72,517



కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించిన ఎస్పీ



సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్న ఎస్పీ క్రిష్ణకాంత్

కర్నూలు, మే 15: రాయలసీమ యూనివర్సిటీలో ఉన్న స్ట్రాంగ్ రూమ్, సీసీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఎస్పీ క్రిష్ణకాంత్ బుధవారం పరిశీలించారు. యూనివర్సిటీలోని 3 బ్లాక్‌లో ఉన్న 16స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన మూడంచల భద్రతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మూడంచల భద్రతలో భాగంగా మొదటి స్థాయిలో కేంద్ర సాయుధ బలగాలు, రెండో స్థాయిలో ఏఆర్ బలగాలు, మూడవ స్థాయిలో సివిల్ పోలీసులు ఉంటారని పేర్కొన్నారు. ప్రతి స్ట్రాంగ్ రూమ్ పరిసరాల్లో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. అగ్ని ప్రమాదం జరగకుండా ఫైర్ ఇంజన్‌లు, విద్యుత్ అంతరాయం లేకుండా జనరేటర్లు ఏర్పాటు చేశామని వెల్లడించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్దకు గుర్తింపు కార్డులేని వ్యక్తులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి స్ట్రాంగ్ రూమ్‌కు ఒకే ప్రవేశ ద్వారం ఉండేలా చర్యలు తీసుకున్నామని, ప్రతి గదికి డబుల్ లాక్ సిస్టమ్ ఏర్పాటు చేశామన్నారు. స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయించామని అన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ విజయశేఖర్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు నాగరాజుయాదవ్, శ్రీనివాసరెడ్డి, శ్రీధర్, గౌతమి ఉన్నారు.

ఫలితాలపై పందేలు



- ఎన్నికల్లో గెలుపునకు ఓ లెక్క.. మెజార్టీపై మరో లెక్క
- నేతల నుంచి కార్యకర్తల దాకా బెట్టింగ్‌ల జోరు
- రూ. కోట్లలో నడుస్తున్న పందేలు

కొలిమిగుండ్ల రూరల్, మే 15: కాయ్ .. రాజా కాయ్ .. ఒకటికి రెండు .. ఒకటికి మూడు .. ఒకటికి ఐదు .. ఎన్నికల ఫలితాలపై జోరుగా సాగుతున్న పందేల పర్వం ఇది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే ఎంతో ప్రాధాన్యత కలిగిన బనగానపల్లె నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపోటములపై ఇప్పుడు పెద్ద ఎత్తున బెట్టింగ్‌లు సాగుతున్నాయి. ఎన్నికల పర్వం ముగిసి ఫలితాలకు జూన్ 4 వరకు వేచి ఉండాల్సి రావడంతో పార్టీల, అభ్యర్థుల జయాపజయాలపై బెట్టింగ్‌ల పర్వం సాగుతోంది. ఏ పార్టీ గెలుస్తుంది? ఎంత మెజారిటీ వస్తుందనే విషయంలో బనగానపల్లె నియోజకవర్గంలోనే కాదు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అనేక ప్రాంతాల్లో పందేలు కొనసాగుతున్నాయి. బనగానపల్లెలో కాటసాని, బీసీ గెలుపుపై పందెం కాస్త తక్కువ మొత్తంలోనే నడుస్తున్నా, బీసీ మెజారిటీపై పెద్దఎత్తున బెట్టింగ్‌లు సాగుతున్నాయి. మరీ ముఖ్యంగా వైసీపీకి కంచుకోట లాంటి కొలిమిగుండ్ల మండలంలో టీడీపీ మెజారిటీ వస్తుందని ఓ వర్గం, కాదు వైసీపీకే మెజార్టీ వస్తుందని మరో వర్గం బెట్టింగ్‌లు కాస్తున్నాయి. ఇందులో రూ. లక్షకు రెండు రూ. లక్షలు, లక్షకు మూడు లక్షలు, ఐదు లక్షల వరకు బెట్టింగ్‌లు సాగుతున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. పెద్ద స్థాయి నేతల నుంచి నాయకులు, కింది స్థాయి కార్యకర్తల వరకు వారి వారి స్థాయిని బట్టి పందేలు వేస్తున్నారు. మరోవైపు బనగానపల్లె నియోజకవర్గం గెలుపు, మెజారిటీలపై ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు రాయలసీమలోని అనేక ప్రాంతాల్లో బెట్టింగ్ నడుస్తుండడం గమనార్హం. మరోవైపు ప్రభుత్వాల ఏర్పాటుపై కూడా పెద్ద మొత్తంలో పందేలా కొన సాగుతున్నట్లు తెలుస్తోంది.



భగ్గుమంటున్న ధరలు

- బీర, చిక్కుడు కేజీ రూ.160
- మిర్చి రూ.120
- కొనలేకపోతున్న సామాన్యులు

చాగలమర్రి, మే 15: కూరగాయల రేట్లు భగ్గుమంటున్నాయి. సామాన్యులు కొనలేనంతగా ధరలు పెరిగాయి. దీంతో కేజీ కొనేవాళ్ల అరకేజీ.. అరకేజీ కొనే వాళ్ల పావు కిలోతో సరిపెట్టుకుంటున్నారు. చాగలమర్రి మార్కెట్‌లో బుధవారం కేజీ మిర్చి రూ.120 పలికింది. కాకర కాయలు కేజీ రూ.120, చిక్కుడు కాయలు కేజీ 160, బీరకాయలు కేజీ రూ.160, క్యారెట్ రూ.80, బీన్స్ కేజీ రూ.160, వంకాయలు కేజీ రూ.60 పలికాయి అల్లం కేజీ రూ.200 ధర పలికింది. ఏ కూరగాయ చూసినా కేజీ రూ.80 నుంచి రూ.100 పలుకుతుండటంతో సామాన్యులు కొనలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం చొరవ తీసుకొని కూరగాయల ధరలను అదుపు చేసి ఆదుకోవాలని పేద, మధ్య తరగతి ప్రజలు కోరుతున్నారు.



డోన్‌లో హైటెన్షన్

- టీడీపీ నేత సీమ సుధాకర్ అరెస్టు
- బనగానపల్లెకు తరలింపు
- టార్గెట్ చేసిన మంత్రి బుగ్గన



టీడీపీ నేతలను అరెస్టు చేసిన పోలీసులు



కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, సుజాతమ్మలతో మాట్లాడుతున్న సీఐ

డోన్, మే 8: టీడీపీ నేత సీమ సుధాకర్ అరెస్టుతో డోన్‌లో హైటెన్షన్ నెలకొంది. బుధవారం తెల్లవారు జామున టీడీపీ నేత సీమ సుధాకర్‌రెడ్డిని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో అరెస్టు చేయడంతో డోన్ ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్యాపిలి మండలంలోని గార్లదిన్నె గ్రామానికి చెందిన జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డైరెక్టర్ సీమ సుధాకర్‌రెడ్డి వైసీపీని వీడి ఎన్నికల సమయంలో టీడీపీలో చేరారు. డోన్‌లో వీఆర్వోగా పని చేస్తున్న మల్లారెడ్డి సోదరులు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. కూటమి అభ్యర్థి కోట్ల ప్రకాష్‌రెడ్డికి మద్దతుగా వీరు ప్రచారం నిర్వహించారు. దీంతో మంత్రి బుగ్గన సీమ సుధాకర్‌రెడ్డి, వీఆర్వో మల్లారెడ్డిని టార్గెట్ చేశారు. గార్లదిన్నె గ్రామంలో ఫిబ్రవరి 12న జరిగిన దాడి కేసులో సీమ సుధాకర్‌రెడ్డితో పాటు మరో ఐదుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. ఎన్నికల్లో వైసీపీకి వ్యతిరేకంగా పని చేశారని మంత్రి బుగ్గన ఆ కేసును తెరపైకి తెచ్చారు. టీడీపీ నేతలను అరెస్టు చేసేవిధంగా పోలీసులకు మంత్రి ఆదేశాలు జారీ చేసినట్లు విమర్శలు ఉన్నాయి. ఈ మేరకు పోలీసు బలగాలతో పట్టణంలోని టీడీపీ నేత సీమ సుధాకర్‌రెడ్డి ఇంటికి తెల్లవారు జామున 3గంటలకు చేరుకున్నారు. సుధాకర్‌రెడ్డి ఇంట్లో నిద్రిస్తుండగా తలుపులు తడుతూ భయభ్రాంతులకు గురి చేశారు. అనంతరం సీమ సుధాకర్‌రెడ్డి, ఆయన తనయుడు రామసుబ్బారెడ్డిని అరెస్టు చేశారు. అలాగే వీఆర్వో మల్లారెడ్డితోపాటు ఏకాంతరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డిలను కూడా అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిని బనగానపల్లె పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఆ తర్వాత బేతంచెర్ల స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కోట్ల ప్రకాష్‌రెడ్డి ఆగ్రహం స్పందించారు. డీఎస్పీతోపాటు పోలీసులు మంత్రి బుగ్గన చెప్పినట్లు పని చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ డీఎస్పీ కార్యాలయం వద్ద ధర్నా చేసేందుకు సిద్ధమయ్యారు. దీంతో టీడీపీ శ్రేణులు భారీ ఎత్తున పట్టణంలోని కోట్ల నివాసానికి చేరుకున్నాయి. సమాచారం తెలుసుకున్న పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ పోలీసు బలగాలతో కోట్ల నివాసానికి వచ్చారు. దీంతో పోలీసులు మోహరించడంపై పార్టీ శ్రేణులు ఆందోళనకు దిగాయి. పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ కోట్ల దంపతులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ధర్నాకు అనుమతి లేదని అర్థం చేసుకోవాలని వారిని కోరారు. అరెస్టు చేసిన వారిని డోన్‌కు తరలిస్తామని హామీ ఇవ్వడంతో ఉద్రిక్త పరిస్థితులు సద్దుమణిగాయి.



పర్యాటక ప్రభ..
బనగానపల్లె

● చారిత్రక, ఆధ్యాత్మిక కేంద్రం ● ఆనందం, ఆహ్లాదం పంచే ప్రాంతాలు

బనగానపల్లె, మే 15


బనగానపల్లె నియోజకవర్గ పరిధిలో అనేక పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. దీని వల్ల బనగానపల్లె పర్యాటక హబ్‌గా మారే అవకాశాలు ఉన్నాయి. మండలంలోని యాగంటి క్షేత్రం పర్యాటకంగానే కాక భక్తి క్షేత్రంగా వర్ధిల్లుతోంది. గతంలో వారంలో సోమవారం, కార్తీక మాసం, శివరాత్రి పర్వదినాల్లో మాత్రమే భక్తులు ఎక్కువగా వచ్చేవారు. రాష్ట్ర విభజన తర్వాత భక్తుల రద్దీ పెరిగింది. వివిధ జిల్లాల నుంచి వాహనాల్లో భక్తులు నిత్యం వందలాదిగా వచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. అలాగే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన బెలుం గుహలు కొలిమిగుండ్ల మండలంలో ఉన్నాయి. నిత్యం వందలాది మంది బెలుం గుహలను సందర్శిస్తుంటారు. బెలుం గుహలు ఆసియాలోనే అతి పెద్దవి. ప్రపంచంలో ద్వితీయ స్థానంలో నిలిచాయి. అలాగే అవుకు రిజర్వాయరును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే సన్నాహాలు జరుగుతున్నాయి. అక్కడ బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేశారు. మండలంలోని మరో ముఖ్యమైన ప్రాంతం నందవరం చౌడేశ్వరీమాత ఆలయం. నిత్యం వేలాదిగా వివిధ రాష్ట్రాల నుంచి తరలివస్తుంటారు. అలాగే యాగంటి సమీపంలోని పాతపాడు గ్రామం వద్ద నవాబుల కాలంనాఇ బంగ్లాను చూడడానికి నిత్యం వందలాది మంది వస్తుంటారు.

యాగంటి :



బనగానపల్లె నుంచి యాగంటి క్షేత్రం 12 కిలోమీటర్ల దూరంలో ఉంది. కర్నూలు నుంచి 87 కిలోమీటర్ల దూరంలో ఉంది. బనగానపల్లె నుంచి యాగంటి వరకు డబుల్ రోడ్డు సౌకర్యం ఉంది. ఆటోల్లో వెళ్లవచ్చు. అలాగే ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది. గతంలో పాతపాడు నుంచి యాగంటికి సింగిల్ రోడ్డు ఉండేది. మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి రూ.2.50 కోట్ల నిధులు మంజూరు చేయించి డబుల్ రోడ్డుగా మార్చారు. యాగంటిలో టూరిజం శాఖ ఆధ్వర్యంలో గదులు ఉన్నాయి. అలాగే బ్రాహ్మణి రెసిడెన్సీలో ఏసీ గదుల సౌకర్యం ఉంది. రూ.కోటి వ్యయంతో కొండలను తొలిచి యాత్రికులు కూర్చోవడానికి, సేదతీరేందుకు దేవదాయశాఖ ప్రణాళికలు రూపొందించింది. వృద్దులు, ఆలయంలోకి వెళ్లేందుకు లిఫ్ట్ సౌకర్యం కల్పించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి.

నవాబు బంగ్లా



బనగానపల్లె పట్టణానికి 10 కిలోమీటర్ల దూరంలో పాతపాడు గ్రామం వద్ద నవాబు బంగ్లా ఉంది. వంద సంవత్సరాల క్రితం దీన్ని నిర్మించారు. ఇప్పటికీ ఈ కట్టడం చెక్కుచెదరలేదు. ఈ బంగ్లా వద్దనే అరుంధతి సినిమాను తీశారు. అందుకే దీన్ని అరుంధతి బంగ్లా అని అంటారు. యాగంటికి వచ్చే యాత్రికులు తప్పనిసరిగా నవాబు బంగ్లాను సందర్శిస్తుంటారు.

బెలుం గుహలు :



కొలిమిగుండ్ల మండలంలో ఉన్న బెలుం గుహల అభివృద్ధికి టూరిజంశాఖ ప్రయత్నాలు చేస్తోంది. ప్రస్తుతం గుహల్లో 27 బ్లోయర్లను ఏర్పాటు చేశారు. 2000లో బెలుం గుహలను అభివృద్ధికి చేసి ప్రారంభించారు. బనగానపల్లె నుంచి గుహలకు ప్రతి అరగంటకు బస్సు సౌకర్యం ఉంది. రోజూ వివిధ రాష్ట్రాల నుంచి 2వేల మంది యాత్రికులు వీటిని సందర్శిస్తుంటారు. సెలవు రోజుల్లో అధికంగా వస్తుంటారు. ఏటా సుమారు 2లక్షల మంది యాత్రికులు గుహల్లో ప్రకృతి సిద్ధమైన శిలాజాలను చూడడానికి వస్తుంటారు. విదేశీయులు కూడా వస్తుంటారు. గుహల్లో ధ్యాన మందిరం, ఊడలమర్రి, పాతాళగంగ, మాయమందిరం, కోటిలింగాలు యాత్రికులను విశేషంగా ఆకర్షిస్తుంటాయి. ఇక్కడ బుద్ధ విగ్రహం ఉంది. అయితే బెలుం గుహల్లో నాలుగు డార్మెట్రీ గదులు మాత్రమే ఉన్నాయి. అయితే గుహల్లో పర్యాటకులకు సరైన సౌకర్యాలు లేవు. గుహల్లో బ్లోయర్లు సరిగా పనిచేయడం లేదు. గుహల్లో తాగునీటి వసతి లేదు.

బోటింగ్ సౌకర్యం నిలుపుదల



అవుకు పట్టణానికి 2 కిలోమీటర్ల దూరంలో అవుకు రిజర్వాయరు వద్ద ఏర్పాటు చేసిన బోటింగ్ సౌకర్యం నిలిపివేశారు. గత రెండు సంవత్సరాల క్రితం రిజర్వాయర్‌లో బోటు బోల్తా పడి ముగ్గురు మృతి చెందారు. దీంతో బోటింగ్ సౌకర్యాన్ని నిలిపివేశారు. రూ.2కోట్లతో టూరిజం శాఖ బోటింగ్ ఏర్పాటు చేసింది. యాత్రికులు సేదతీరడానికి విడిది కూడా నిర్మించారు. పిల్లలు ఆడుకోవడానికి పార్కును ఏర్పాటు చేశారు. గతంలో స్పీడ్‌బోట్లు, మరబోట్ల సౌకర్యం ఉండేది. ప్రస్తుతం ఇవన్నీ నిలిపివేశారు.

చౌడేశ్వరీ మాత ఆలయం :



మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయం. యాత్రా స్థలంగానే కాక ఆధ్యాత్మిక కేంద్రంగా వెలుగొందుతోంది. ఇక్కడ చౌడేశ్వరీ మాత ఆలయం ప్రసిద్ధిగాంచింది. జిల్లా నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి నిత్యం వాహనాల్లో వస్తుంటారు. బనగానపల్లెకు 10 కిలోమీటర్ల దూరంలో ఉంది. 20 నిమిషాలకోసారి బస్సు సౌకర్యం ఉంది.

బీఈడీ, డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు ఏర్పాట్లు

కర్నూలు(అర్బన్), మే 15: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ, డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎన్. వెంకటేశ్వర్లు తెలిపారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో డిగ్రీకి 61, బీఈడీ, డీపీఈడీ, ఎంపీఈడీ సెమిస్టర్ పరీక్షలకు 15 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, విద్యార్థులందరూ నిబంధనలు తప్పక పాటించాలని కోరారు. డిగ్రీ 2,4,6 సెమిస్టర్ పరీక్షలు, బీఈడీ 1,3,4 సెమిస్టర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు.

అభ్యర్థుల గెలుపు కోసం అందరూ పని చేశారు

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కే బాబు రావు

కర్నూలు(అర్బన్), మే 15: సార్వత్రిక ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు పని చేశారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే. బాబు రావు అన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించేందుకు ముందస్తు ప్రణాళికలతో జిల్లాలో ప్రచారం నిర్వహించడంతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నామని తెలిపారు. ఈ క్రమంలో గురువారం పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ జిల్లా పర్యటనకు రానున్నారని తెలిపారు.

ఏపీఈఏపీ సెట్‌కు సర్వం సిద్ధం

కర్నూలు (ఎడ్యుకేషన్), మే 15 : ఇంజనీరింగ్, అగ్రికల్చర్, బీ ఫార్మసీ ప్రవేశాలకు నిర్వహించే ఏపీఈఏపీసెట్ 2024కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. 16 ,17 తేదీలలో అగ్రికల్చర్, బీ ఫార్మసీ, 18 నుంచి 23వ తేదీ వరకు ఇంజనీరింగ్ విభాగం పరీక్షలు జరగనున్నాయి. కర్నూలు నగరంలో 6, ఎమ్మిగనూరులో 1 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష లకు 18,309 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్ష కేంద్రాలకు ఒక గంట ముందే విద్యార్థులు చేరుకోవాలని అధికారులు సూచించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



రామాంజనేయులు(ఫైల్)

కోసిగి, మే 15: మండలంలోని దేవరబెట్ట గ్రామానికి చెందిన యువ రైతు సద్దాల రామాంజనేయులు(28) తన వ్యవసాయ పొలంలో విద్యుదాఘాతంతో బుధవారం మృత్యువాత పడ్డాడు. బోరుకు బిగించిన విద్యుత్ వైర్లు ఎర్త్ కావడం గమనించకుండా మోటారును ఆన్ చేయడంతో కరెంట్ షాక్‌కు గురై అక్కడిక్కడే కింద పడి పోయాడు. తోటి రైతులు, తండ్రి బూదురెడ్డి వెంటనే కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. డాక్టర్ మనోజ్ కుమార్ పరీక్షించి అప్పటికే మరణించినట్లు తెలిపారు. మృతునికి భార్య నాగవేణి ముగ్గురు కుమారులు సంతానం ఉన్నారు. నాగవేణి ప్రస్తుతం ఐదు నెలల గర్భిణి. రామాంజనేయుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తండ్రి ఫిర్యాదు మేరకు కోసిగి ఎస్‌ఐ సతీష్ కుమార్ కేసు నమోదు చేశారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. విద్యుత్ శాఖ అధికారులు, ప్రభుత్వం రైతు కుటుంబానికి నష్టపరిహారం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చింత చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి



మృతి చెందిన గోవిందు

మహానంది, మే 15: చింత చెట్టుపై నుంచి పడి బుధవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలం కేంద్రంలోని పార్వతీపురం కాలనీకి చెందిన గోవిందు(52) మహానంది దేవస్థానంలో ఏజన్సీ ప్రతిపాదికన విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆలయం సమీపంలోని చింత ఎక్కి చిగురు కోసుకుంటుండగా కాలు జారి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడడంతో తోటి ఉద్యోగులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మహానంది పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దాడి కేసులో ఎనిమిది మందిపై కేసు నమోదు

పగిడ్యాల, మే 15: మండల పరిధిలోని పడమర ప్రాతకోట గ్రామంలో టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య జరిగిన ఘర్షణలో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ ఎస్ఐ జయశేఖర్ తెలిపారు. ఈ ఘటనలో వైసీపీ కార్యకర్త విజేయుడుకు గాయపడటంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తెలుగు వెంకటేశ్వర్లు, లక్ష్మన్న, గంగి రమణ, హరి, శేఖర్, కాశీ, కర్ల, నగేష్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు చేపట్టాలి

- ఈవో పెద్దిరాజు



మాట్లాడుతున్న ఈవో పెద్దిరాజు

శ్రీశైలం, మే 15: శ్రీశైలం దేవస్థానంలో సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు చేపట్టాలని ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు స్థానిక సత్ర సముదాయాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఆలయ కార్యాలయ భవనంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఆలయ అధికారులు, సత్రం నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో పెద్దిరాజు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. ప్లాస్టిక్ నియంత్రణపై సత్రాల నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని కోరారు. ప్రతి సత్రం వద్ద రెండు చెత్తకుండీలను ఏర్పాటు చేసి పొడి చెత్త, తడిచెత్తను వేరువేరుగా సేకరించాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. దేవస్థానం పరిధిలో ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధించామని, వాటికి ప్రత్యామ్నాయంగా మట్టి, కాగితం గ్లాసులు, రాగి సీసాలు, గాజు సీసాలు, కాగితం, జూట్ బ్యాగులు విస్తరాకులు వినియోగించాల అన్నారు. కార్యక్రమంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రామకృష్ణ, సహాయ కార్యనిర్వహణాధికారి మల్లికార్జునరెడ్డి, ప్రజాసంబంధాల అధికారి శ్రీనివాసరావు, భద్రతా విభాగపు పర్యవేక్షకులు అయ్యన్న, రెవెన్యూ విభాగపు పర్యవేక్షకుడు శివప్రసాద్ పాల్గొన్నారు.

నకిలీ విత్తు.. రైతు చిత్తు!

- పల్లెలకు చేరుతున్న బీటీ-2 పత్తి నకిలీ విత్తనాలు
- కర్ణాటక, తెలంగాణలో ప్యాకింగ్
- అధికారులు అప్రమత్తం కావాల్సిన సమయం ఇదే
- నిఘా కళ్ల మూసుకుంటే కష్టజీవులకు ఉరితాళ్లే



వెల్దుర్తి వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్న బీజీ-2 పత్తి నకిలీ విత్తనాలు (ఫైల్)

కర్నూలు, మే 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ గ్రామాలకు అప్పుడే బీటీ-2 పత్తి నకిలీ విత్తనాలు తరలిస్తున్నారు. రహస్య ప్రాంతాల్లో నిల్వ చేసి రైతులకు అంటగట్టేందుకు అక్రమార్కులు సిద్ధమవుతున్నారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ప్యాకింగ్ చేసి.. ఉమ్మడి జిల్లాలో ఆదోని, కర్నూలు, నంద్యాల కేంద్రంగా వివిధ ప్రాంతాలకు చేర్చేందుకు సన్నాహాలు చేసుకుంటున్నట్లు విశ్వాసనీయ సమాచారం. ముందుగా జిల్లా వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిఘా అధికారులు నకిలీ విత్తన సరఫరాకు అడ్డుకట్ట వేయకపోతే.. తక్కువ ధరకు వస్తాయని నకిలీ, నాసిరకం విత్తనాలను నమ్ముకొని రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. అదే జరిగితే అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలే శరణ్యమని రైతు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో గతేడాది 2023-24 ఖరీఫ్‌లో 3.15 లక్షల హెక్టార్లు (7.87 లక్షల ఎకరాలు)లో బీటీ-2 పత్తి సాగు చేశారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఈ ఏడాది రుతుపవనాలు ఆశాజనకంగా ఉండడంతో పత్తిపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. రెండు రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాలకు పొలాలు దుక్కులు దున్ని విత్తనాలు వేసేందుకు సన్నద్ధం చేస్తున్నారు. 2024-25 ఖరీఫ్‌లో 3.15-3-25 లక్షల హెక్టార్లలో సాగు చేయవచ్చని అనధికారిక అంచనా. రైతులు ఎకరాకు మూడు ప్యాకెట్లు (ఒక్కో ప్యాకెట్ 450 గ్రాములు) విత్తనాలు పొలంలో నాటుతున్నారు. ఈ లెక్కన సుమారు 23.62 లక్షల బీటీ-2 పత్తి విత్తన ప్యాకెట్లు అవసరమని అంచనా. ఆ స్థాయిలో అనుమతి పొందిన విత్తన కంపెనీలు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయడం లేదని, గత ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల పత్తి విత్తన ఉత్పత్తి కూడా బాగా తగ్గిందని వ్యవసాయ నిపుణులు అంటున్నారు. ఇదే అదనుగా భావించిన నకిలీ విత్తన మాఫియా రైతుల ప్రాణాలతో చెలగాటమాడుతోందని రైతు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. నకిలీ విత్తన వ్యాపారులు పల్లెల్లో వాలిపోయి మట్టిమనుషులను దగా చేస్తున్నారు. తక్కువ రేటుకు వస్తాయని వాటిని కొనుగోలు చేసి సరైన దిగుబడులు రాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

● అడ్డుకోవాలి:



ఆదోని మండలం పెసలబండ, బైచిగేరి, బస్సాపురం, పెద్దహరివాణం, సంతేకూడ్లూరు, ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల, ఎమ్మిగనూరు టౌన్, కోసిగి మండలం దుద్ది, పల్లెపాడు, కోల్‌మాన్‌పేట, కందుకూరు, కోసిగి, సాతనూరు, వందగల్లు, ఆస్పరి మండలం కారుమంచి, కోడుమూరు మండలం అమడగుంట్ల, వెంకటరిగి, అల్లినగర్, గోనెగండ్ల మండలం అగ్రహారం, గంజెహల్లి గ్రామాలు నాసిరకం విత్తనాలకు అడ్డాగా మారాయనే ఆరోపణలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఐజ, గద్వాలకు చెందిన విత్తన వ్యాపారులు కొందరు జిల్లాలో అక్రమార్కులతో కుమ్మక్కై నకిలీ, నాసిరకం విత్తనాలు సరఫరా చేస్తున్నారు. అలాగే.. కర్ణాటక రాష్ట్రం సిరుగుప్ప ప్రాంతంలో ప్యాకింగ్ చేసిన బీటీ-2 పత్తి విత్తనాలను జిల్లాలో వివిధ ప్రాంతాలకు చేరవేస్తుండగా గత ఏడాది, అంతకుముందు ఏడాది నిఘా అధికారులు పట్టుకొని రూ.లక్షల విలువైన విత్తనాలు సీజ్ చేశారు. కర్ణాటక రాష్ట్రం సిరుగుప్ప, రాయచూరు, సింధనూరు ప్రాంతాల నుంచి కూడా జిల్లాకు భారీగా నకిలీ విత్తనాలు వస్తున్నాయి. నంద్యాల పట్టణం నూనేపల్లి కేంద్రంగా భారీ ఎత్తున పత్తి నకిలీ విత్తనాలు ప్యాకింగ్, సరఫరాను గతంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గుట్టు రట్టు చేశారు. అలాగే.. కర్నూలు నగరం కల్లూరు ఎస్టేట్ ప్రాంతంలో కూడా రూ.లక్షల విలువైన నకిలీ విత్తనాలు సీజ్ చేశారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిఘా పెంచి ఇతర రాష్ట్రాల నుంచి సరిహద్దులు దాటి జిల్లాకు నకిలీ విత్తనాలు రాకుండా అడ్డుకట్ట వేయాలని ఏపీ రైతు సంఘం నాయకుడు జగన్నాథం డిమాండ్ చేశారు.

ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్ పరిశీలన



ఆర్‌యూలో స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఆర్‌ఓ ఎ. భార్గవతేజ

కర్నూలు(న్యూసిటీ), మే 15: నగర శివారులోని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను రిటర్నింగ్ అధికారి ఎ.భార్గవతేజ పరిశీలించారు. బుధవారం రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేసి ఈవీఎంలను ఆర్‌ఓ సందర్శించి స్ట్రాంగ్ రూ మ్ భద్రత ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల పర్యవేక్షణ 24 గంటలు ఉండాలని స్థానిక అధికారులకు ఆర్‌ఓ సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, మే 15: విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు డివిజన్ ఈఈ వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు ఓల్డ్‌టౌన్ సెక్షన్, ఇండస్ట్రీయల్ ఏస్టేట్ సెక్షన్, బీక్యాంప్ సెక్షన్‌లలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రాజేంద్రబాబు తెలిపారు. జోహరాపురం, న్యూక్రిష్ణానగర్, క్రిష్ణానగర్, శ్రీలక్ష్మీనగర్, అరోరానగర్, మాధవనగర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల తదితర ప్రాంతాల్లో కరెంటు కోత ఉంటుందని ఆయన తెలిపారు.

డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే చర్యలు

సి.బెళగల్, మే 15: డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తిమ్మారెడ్డి హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ తిమ్మారెడ్డి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానా విధిస్తామన్నారు. వాహనాల తనిఖీలో భాగంగా రూ1,585 జరిమానా వసూలు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా మారెమ్మ దేవర

సి.బెళగల్, మే 15: మండలంలోని ఇనగండ్ల గ్రామంలో మారెమ్మ దేవర బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ ప్రతి మూడు సంవత్సరాలకోసారి వచ్చే మారెమ్మ దేవరను గ్రామంలో కులమతాలకు అతీతంగా అందరూ కలిసి జరుపుకుంటామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ తిమ్మారెడ్డి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

భగవద్గీత గ్రంథాల పంపిణీ



భగవద్గీతలను పంపిణీ చేస్తున్న దృశ్యం

కర్నూలు (కలెక్టరేట్), మే 15: మానవీయ విలువలను పెంపొందింపజేసి, మనిషిని కర్తవ్యోన్ముకుడిని చేసేది భగవద్గీత అని గోదాగోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజు గుప్త, ట్రస్టీ పల్లెర్ల నాగరాజు అన్నారు. కర్నూలు శివారులోని గోదాగోకులంలో బుధవారం విద్యార్థులకు భగవద్గీత గ్రంథాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటింటా భగవద్గీత ఆనందమయ జీవితానికి దోహదం చేస్తుందని అన్నారు. దేశ ఔన్నత్యాన్ని తెలిపే భగవద్గీతను ఇతర దేశాల వారికి అందించాలని కోరారు. కార్యక్రమంలో నాగనారాయణరావు, మహేశ్వరరెడ్డి, మీసాల సుమలత, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా ప్రభోత్సవం

కోడుమూరు(రూరల్), మే 15: మండలంలోని పులకుర్తిలో బుధవారం సాయిబాబా ప్రభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. సాయినాథుడి పాలరాతి విగ్రహాన్ని పట్టువస్త్రాలు, సుగంధ పరిమళపుష్పాలతో అలంకరించారు. సాయంత్రం ప్రభపై సాయి బాబా ఉత్సవ విగ్రహాన్ని ఉంచి మేళతాళాల మధ్య ఎదురు మండపం వరకు ఊరేగించారు. ప్రభోత్సవంలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. గురువారం సాయంత్రం సాయి బాబా రథోత్సవం జరగనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు.



ప్రభోత్సవంలో పాల్గొన్న భక్తులు

అరటి రైతుపై కరువు కాటు

పంటను కాపాడుకోలేకపోయాం



18 ఎకరాలు కౌలుకు తీసుకుని అరటి సాగు చేశాను. ఇందుకోసం రూ.లక్ష పెట్టుబడి పెట్టాను. వర్షాలు లేక తోటలు ఎండిపోయి దాదాపు రూ.15 లక్షలు నష్టం వచ్చింది. బోర్లలో భూగర్భ జలాలు ఇంకిపోయాయి. చేతికి వచ్చిన పంట కళ్లెదుటే ఎండిపోయింది. తీవ్రంగా నష్టపోయాం. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

\- జీకే సుధాకర్ రైతు

అరటి రైతులను ఆదుకోండి



మా కుటుంబం తరతరాలుగా అరటి తోటలతోనే జీవనం సాగిస్తోంది. ఈ ఏడాది బోర్లలో నీరు పూర్తిగా ఇంకిపోవడంతో 13 ఎకరాల్లో సాగు చేసిన అరటి తోట దాదాపుగా ఎండిపోయింది. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పరిశ్రమలకు మాత్రమే నీరందిస్తోంది. రైతులకు సాగు నీరు అందిస్తే 50 వేల రైతు కుటుంబాలు జీవనోపాధి పొందవచ్చు.

\- సీఎన్ శేఖరప్ప

ఎన్ని బోర్లు వేసినా నీరు పడటం లేదు



బోరులో నీరు అడుగంటడంతో కొత్తగా మరో బోరువే యించాను. అందులోనూ నీరు పడలేదు. దీంతో మూడు ఎకరాల్లో సాగు చేసిన అరటి తోట పూర్తిగా ఎండిపోయింది. అరటి తోట అంతా తొలగించేశాను. దాదాపుగా రూ.4 లక్షల నష్టం వాటిల్లింది. పంటపై చేసిన అప్పులు తీర్చలేకపోయాను. ప్రభుత్వం ఆదుకొని నష్ట పరిహారం అందించాలి.

\- రామమద్దిలేటి, రైతు

» వర్షాభావంతో ఎండిపోయిన తోటలు
» ఆందోళనలో అన్నదాతలు

ఓర్వకల్లు, మే 15: ఒకప్పుడు ఆ గ్రామాలు అరటి తోటలతో పచ్చదనాన్ని తలపించేవి. నిత్యం కూలీలతో సందడగా కనిపించేవి. ప్రస్తుత పరిస్థితి ఇందుకు భిన్నంగా తయారైంది. వర్షాలు లేక ఎండిపోయిన అరటి చెట్లు దర్శనమిస్తున్నాయి. దీంతో రైతులు జీవినం దుర్భరంగా మారింది. మండలంలోని కాలువ ఉశేనాపురం, కాలువ్వబుగ్గ, సోమయాజులపల్లె గ్రామాల్లోని దాదాపు 400 ఎకరాల్లో అరటి పంట సాగు చేసేవారు. ఈ పంట సాగుతో రైతులకు సుస్థిరమైన ఆదాయం లభించేది. కూలీలకు చేతి నిండా పని ఉండేది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. దీంతో వ్యవసాయ బోర్లు ఎండిపోయి అరటి తోటలకు నీరందని పరిస్థితి నెలకొంది. దీంతో రూ.లక్షలు అప్పు చేసి తోటలు సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. కళ్లెదుటే తోటలు ఎండిపోతుండటంతో గుండెలు బాదుకుంటున్నారు.



కాల్వబుగ్గలో ఎండిపోయిన అరటి చెట్లు





అరటి చెట్లను తొలగించిన రైతు

సమస్యాత్మక కేంద్రాల్లో తగ్గిన పోలింగ్

» 66.6 శాతం నమోదు
» అత్యంత సమస్యాత్మ కేంద్రాల్లో 64.5 శాతం

కర్నూలు(న్యూసిటీ), మే 15: కర్నూలు అసెంబ్లీ పరిధిలో సమస్యాత్మక కేంద్రాలు-16, అత్యంత సమస్యాత్మక కేంద్రాలు-7 ఉన్నట్లు గుర్తించారు. ఈ కేంద్రాలలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. సమస్యాత్మక కేంద్రాలైన రోజా-1, ప్రకాష్‌నగర్-5, సి. క్యాంపు-2, ఉస్మానియా కళాశాల-5, జొహరాపురం-3 కేంద్రాలలో మొత్తం 19,388 ఓటర్లు ఉండగా 12,918 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 66.6 శాతం పోలైంది. అదే విధంగా అత్యంత సమస్యాత్మక కేంద్రాలైన కేశవ మెమోరియల్ పాఠశాల బుధవారపేట-4, కొత్తపేట రైతు బజార్-3 కేంద్రాలలో మొత్తం 7003 మంది ఓటర్లు ఉండగా 1259 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో 64.5 శాతం పోలైంది. ప్రధానంగా ముస్లింలు ఉండే ప్రాంతాలలో తక్కువగా పోలింగ్ జరిగింది. వైసీపీ నాయకులు ముస్లిం ఓటర్లపైనే ఎక్కువగా ఆధారపడి ఉన్నారు. కానీ వారు టీడీపీ వైపే ఎక్కువ శాతం మొగ్గుచూపినట్లు తెలుస్తోం ది. కర్నూలు అసెంబ్లీ పరిధిలో మొత్తం 258 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ రోజు 63.7 శాతం పోలైంది.

మొత్తం ఓటర్లు 274465, పురుషులు- 132769, మహిళలు-141665, ఇతరులు-31

మొత్తం పోలైన ఓట్లు 174973, పురుషులు-86250, మహిళలు-88715, ఇతరులు-08

- సమస్యాత్మక కేంద్రంలో 19388 ఓటర్లు ఉండగా 12918 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- అత్యంత సమస్యాత్మక కేంద్రంలో 7003 ఓటర్లు ఉండగా 1259 ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- సమస్యాత్మకం కేంద్రాలు 16, అత్యంత సమస్యాత్మం కేంద్రాలు 7 ఉన్నాయి.

పోలింగ్ లెక్కలపై పార్టీల ఆరా

» గెలుపోటములపై ఎవరి ధీమా వారిదే..
» పాణ్యం అసెంబ్లీలో 75.7 శాతం పోలింగ్

కల్లూరు, మే 15: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ ప్రశాతంగా ముగియడంతో ఆయా పార్టీల నేతలు పోలైన ఓట్ల లెక్కలు వేయడంలో నిమగ్నమయ్యారు. పాణ్యం నియోజకవర్గంలో ఆయా పార్టీల అధినేతలు మండలాల వారీగా ఎన్ని ఓట్లు ఉన్నాయి, గ్రామాల్లో పోలింగ్ బూతుల వారీగా ఏజెంట్లతో వివరాలు తెలుసుకుని పోలింగ్ సరళిని బేరీజు వేసుకుంటున్నారు. పాణ్యం నియోజకవర్గంలో 75.7 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు నిర్ధారించారు. దీంతో టీడీపీ, వైసీపీ నేతలు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తు న్నారు. పాణ్యం నియోజకవర్గంలో గెలిచి తమ అధిపత్యం చాటాలని తహతహలాడుతున్నారు. నియోజకవర్గంలో మండలాల వారీగా పోలైన ఓట్లు వివరాలు.

మండలం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	పర్సంటేజి
కల్లూరు	37953	33303	87.75
ఓర్వకల్లు	48654	42285	86.91
గడివేముల	34635	30245	87.3
పాణ్యం	37198	32025	86.09
కల్లూరు టౌన్	173266	109039	62.93
పోస్టల్ బ్యాలెట్		4246	-
మొత్తం -	331706	251145	75.7

గెలుపుపై టీడీపీ ధీమా

» ఎక్కడ చూసినా అదే ముచ్చటే..
» పెదవి విప్పని ఓటర్లు .. విశ్లేషణలో నేతలు..
» ఈవీఎంలలో భవిత

కర్నూలు(అర్బన్), మే 15: కర్నూలు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టీజీ భరత్ విజయం తథ్యమని ఆ పార్టీ శ్రేణులు ధీమాగా ఉన్నాయి. నగరంలోని వార్డుల వారిగా వచ్చే అధిక్యతను బట్టి దాదాపు 30 వేల పైబడి ఓట్ల మెజారిటీ వస్తుందని విశ్లేషిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత టీడీపీ సూపర్ సిక్స్ ఉమ్మడి మేనిఫెస్టో తమకు అనుకూలిస్తాయని టీడీపీ నాయకులు ధీమాగా ఉన్నారు. నగరంలోని పలు వార్డుల్లో ఆధిక్యత వచ్చే పరిస్థితి ఉందని లెక్కలు వేస్తున్నారు. వైసీపీ అభ్యర్థి ఇంతియాజ్ స్థానికేతరుడు కావడం, మరో వైపు మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్యే ఆధిపత్య పోరు ఆయనకు మైనస్‌గా మారిందనే ప్రచారం జోరుగా ఉంది. వైసీపీ కంచుకోటగా ఉన్న కొన్ని వార్డుల్లో సైతం టీడీపీ పుంజుకోవడంతో వైసీపీ ఆధిక్యతకు గండి పడిందని చెబుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో టీడీపీ అభ్యర్థి విజయం తథ్యమని చెబుతున్నారు. కాగా వైసీపీ నాయకులు సైతం గెలుపు తమదేననే ధీమాతో ఉన్నారు.

● ఈవీఎంల్లో భవిత..

అభ్యర్థుల పట్ల ఓటర్ల తీర్పు ఈవీఎంల్లో భద్రంగా నిక్షిప్తమైంది. వారి భవితవ్యం జూన్ 4న తేలనుంది. సోమవారం రాత్రి పోలింగ్ ముగియగానే ఈవీఎంలకు సీల్ వేసి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య కర్నూలు నగర శివారులోని రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌లో భద్రపరిచారు. లెక్కింపు తర్వాత ఎవరు ఓడేదీ.. ఎవరు గెలిచేది తేలిపోతుంది.



పాతబస్తీలో సర్వే నిర్వహిస్తున్న బృందం

● ఎవరు ఎవరికి అనుకూలం..

నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారు.. ఏ వర్గం ఓట్లు ఎవరికి అనుకూలంగా పడ్డాయి. ఇదీ ఇప్పుడు జరుగుతున్న ప్రధాన చర్చ .. ఆయా పార్టీల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు, అంచనాల్లో మునిగి తెలుతున్నారు. నియోజకవర్గం పరిధిలో ఎన్ఆర్‌పేట, వెంకటరమణకాలనీ, నరసింహరెడ్డినగర్, అశోక్ నగర్, బీ. క్యాంప్, శ్రీరామ్ నగర్, పాత బస్తీ, జోహరాపురం ప్రాంతాల్లోని ఓటింగ్ శాతం ఆధారంగా లెక్కలేస్తున్నారు.

ఇద్దరు వైద్యులు ఉన్నా అందని వైద్యం

సి.బెళగల్, మే 15: మండలంలోని పోలకల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు ఉన్నా ఎవరు ఎప్పుడు వస్తారో తెలియదని గ్రామస్థులు అంటున్నారు. ఈ వైద్యశాల కేవలం పేరుకి మాత్రమే ఉంది. సి. బెళగల్ మండలంలోనే పోలకల్లు పెద్ద గ్రామ పంచాయతీ అని అధికారులు ఇద్దరు వైద్యులను నియమించారు. వీరిలో ఒకరు ఫీల్డ్, మరొకరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉండాలని ఏర్పాటు చేశారు. అయితే పోలకల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గూడూరు మండలంలోని నాగలాపురం, గుడిపాడు, మునగాల, మల్లాపురం, జూలకల్లు, బుడిదపాడు, పెంచికలపాడు గ్రామాలను పోలకల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కలపడంతో పోలకల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎవరు ఎప్పుడు వస్తారో తెలియదని గర్భిణులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికా రులు చొరవ తీసుకుని గర్భిణులకు, రోగులకు వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ఖాళీగా ఉన్న వైద్యుడి కుర్చీ



వైద్యుల కోసం ఎదురు చూస్తున్న గర్భిణులు

చినుకు పడితే చిత్తడే



గూడూరు ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో నిలిచిన వర్షం నీరు

గూడూరు, మే 15: చినుకు పడితే చాలు చిత్తడి .. చిత్తడిగా మారుతుంది గూడూరులోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణ. రెండు రోజుల క్రితం గూడూరులో భారీ వర్షం కురిసింది. దీంతో గూడూరులోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో వర్షం నీరు నిలిచి చిత్తడిగా మారింది. దీంతో జనం ఇబ్బంది పడ్డారు. ఈ ఆవరణలో తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్, సబ్ ట్రెజరీ, వ్యవసాయ, గృహ నిర్మాణ శాఖ, వసతి గృహం వంటి ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. వర్షం కురిసిందంటే గూడూరులోని ఈ ప్రభుత్వ కార్యాలయాల ఆవరణ జలాశయాన్ని తలపిస్తోంది. ఈ ఆవరణలో వర్షం నీరు నిలబడకుండా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎడారిగా తుంగభద్ర

తాగునీటి కోసం అవస్థలు పడుతున్న నదీ తీర గ్రామాల ప్రజలు

సి.బెళగల్, మే 15: మండలంలోని తుంగభద్ర నది తీర గ్రామాలైన తిమ్మనదొడ్డి, సంగాల, గుండ్రేవుల, కొండాపురం, పల్దొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె, శింగవరం, కొత్తకోట గ్రామాలకు పక్కన ఉండే తుంగభద్రనది ఈ సంవత్సరం మార్చి నెల చివరికి పూర్తిగా ఎండిపోయింది. దీంతో నదీ తీర గ్రామాల ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. నది పక్కన ఉన్న గ్రామాల ప్రజలు మాట్లాడుతూ తుంగభద్ర నదిలో ఉన్న ఇసుకను తోడేయడంతో నది పూర్తిగా ఎండిపోయిందని, ఇలా జరగడం ఇదే మొదటిసారి అని అన్నారు. ప్రతి సంవత్సరం మే నెలలో కూడా నదిలో మోకాలు లోతు నీళ్లు పారుతూ ఉండేవని, నది ఎండిపోవడంతో ఎక్కన ఉన్న 9 తొమ్మిది గ్రామాలకు ఇప్పుడు తాగు నీరు లేక జనాలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. నీరు లేక మూగ జీవాలను అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన చెందుతున్నారు.



చుక్క నీరు లేని తుంగభద్ర నది

20 రోజులైనా గుక్కెడు నీరు అందించలేరా..?

● మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆవేదన



తాగునీటి సమస్యపై ఏఈ మోహన్‌ను ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు ఎల్లమ్మ

ఆలూరు రూరల్, మే 15: గ్రామాలకు 20 రోజులైనా గుక్కెడు తాగునీరు సరఫరా చేయడం లేదని మొలగవల్లి కొట్టాల సర్పంచు రాజశేఖర్, వైస్ ఎంపీపీ కురవ శ్రీరాములు, ఎంపీటీసీ మోతి ఎల్లమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం హాల్‌లో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ రంగమ్మ అధ్యక్షతన జరిగింది. ఆలూరు, మొలగవల్లి, మొలగవల్లి కొట్టాల గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మోహన్‌ను ప్రశ్నించారు. గ్రామ పంచాయతీ పరిధిలో సమస్యలు పరిష్కారం కానప్పుడు సమావేశాలు ఎందుకని కురకుంద సర్పంచి దేవిరెడ్డి నిలదీశారు. ప్రభుత్వ పాఠశాలలను పర్యవేక్షణ చేయడం లేదన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జడ్పీటీసీ సభ్యుడు ఏరూరు శేఖర్ కోరారు. గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో నరేంద్రకుమార్. వైస్ ఎంపీపీ నాగవేణి. ఈవోపీఆర్డీ ప్రకాష్‌నాయుడు. ఏపీవో శ్రీనివాసులు, సర్పంచులు, ఎంపీటీసీలు అధికారులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతన్న

● 14వేల హెక్టార్లలో పత్తి, ఉల్లి, వేరుశనగ, కంది సాగుకు సిద్ధం



పంట సాగుకు వేరుశనగ విత్తనాలను సిద్ధం చేస్తున్న మహిళా రైతులు

గోనెగండ్ల, మే 15: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ముందుగాను వచ్చింది. సోమవారం తెల్లవారుజామున కురుసిన వర్షం కారణంగా మండలంలో ఖరీఫ్ సాగుకు రైతన్నలు సిద్ధయ్యారు. మహిళా రైతులు వేరుశగన విత్తనాలు విత్తేందుకు గాను విత్తనాలను సిద్ధం చేసున్నారు. సోమవారం 53.4 ఎంఎం వర్షం కురిసింది. దీంతో రైతులు పొలం పనులు మొదలు పెట్టారు. బావులు, బోర్ల దగ్గర ముందస్తు పొలం పనులు పూర్తి చేసుకున్న రైతులు పత్తి, ఉల్లి, పంటల సాగుచేస్తున్నారు. మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 14వేల హెక్టార్‌లలో పత్తి, మేరుశనగ, ఉల్లి, కంది, పంటలు సాగు చేస్తున్నారు. ఎక్కువగా పత్తి, ఉల్లి, వేరుశనగ పంటలను సాగు చేస్తున్నారు. గోనెగండ్ల, అలువాల, గాజులదిన్నె, హెచ్ కైరవాడి, కులుమాల, గంజహళ్లి పెద్దనేలటూరు, పెద్దమరివీడు గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో ఇప్పటికే పొలం పనులు మొదలు పెట్టారు.

ఈ రోడ్డు మీద ప్రయాణం సాధ్యమేనా?



కొద్దిపాటి వర్షానికే గుంతల మయంగా మారిన రోడ్డు

గోనెగండ్ల, మే 15: ఈ చిత్రంలో కనిపిస్తున్నది పెద్దనేటూరు, బురాన్‌దొడ్డి గ్రామాల మధ్య రహదారి. ఏళ్లు గడుస్తున్నా రోడ్డు మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఈ రెండు గ్రామాల మధ్య నాలుగు కిలోమీటర్ల దూరం ఉంది. ఇదే రోడ్డు వెంట ఇరు గ్రామాల రైతులు పొలాలకు వెళ్లాలి. వర్షకాలంలో పొలలాకు ఎరువుల, మందులు తీసుకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలి నడకన కూడా రాక పోకలకు ఇబ్బందిగా ఉందని ఇరుగ్రామాల ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు.

పైపులైన్‌ను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

గోనెగండ్ల, మే 15: మండల పరిధిలోని బీ అగ్రహారం గ్రామంలో తాగునీటి మెయిన్ పైప్ లైన్‌ను ధ్వంసం చేసిన వారి పై చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచు రంగారెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామంలో కొంతకాలంగా తాగునీటి సమస్య నెలకొంది. గ్రామానికి కడివెళ్ల వంకలో వేసిన బోర్ నుంచి గ్రామంలోని ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌కు నీరు సరఫరా అవుతోంది. ఈ నీరు గ్రామంలోని కొన్ని వీధులకు మాత్రమే సరఫరా అవుతుండటంతో అగ్రహానికి లోనైన కొందరు కాలనీ వాసులు ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌కు నీరు పరఫరా అయ్యే పైప్‌లను ధ్వంసం చేశారు. దీంతో గ్రామానికి మొత్తం నీటి సరఫరా నిలిచిపోయింది. వేసవికాలం కావడంతో గ్రామస్థులు నీటి కోసం అల్లాడుతున్నారు. ప్రభుత్వ ఆస్తి అయిన తాగునీటి పైప్ లైన్‌నుధ్వంసం చేసిన వారి పై చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కడుపు నొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య

హొళగుంద, మే 15: మండల పరిధిలోని వందవాగిలి గ్రామానికి చెందిన అనసూయమ్మ (30) అనే వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఏఎస్సై శ్రీనివాసులు వివరాల మేరకు.. మృతురాలు గత ఆరు నెలలుగా కడుపునొప్పితో బాధపడుతుండేది. బుధవారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో పంట పొలాలకు వినియోగించే క్రిమిసంహారక మందు తాగడంతో, చుట్టుపక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందినట్లు భర్త దాసరి రమేష్ తెలిపారు. మృతురాలి తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

మహిళపై దున్నపోతు దాడి

● తీవ్ర గాయాలు, ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స

చిప్పగిరి, మే 15: చిప్పగిరి గ్రామానికి చెందిన తలారి గౌరమ్మ అనే మహిళ ఉపాధి పనులకు వెళ్తుండగా ఎంపీడీవో కార్యాలయం సమీపంలో దున్నపోతు దాడిచేసి గాయపర్చింది. గమనించిన తోటి ఉపాధి కూలీలు దున్నపోతును తరిమేందుకు ప్రయత్నించగా, అది మరింతగా రెచ్చిపోయి, తీవ్రగాయాలపాలైన గౌరమ్మపై మరొక్కసారి విరుచుకుపడి దాడికి పాల్పడింది. తీవ్రంగా గాయపడ్డ గౌరమ్మను చికిత్స నిమిత్తం గుంతకల్లులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రభుత్వం ఆదుకోవాలని తోటి ఉపాధి కూలీలు, కుటుంబసభ్యులు ప్రభుత్వాన్ని కోరారు.

అభ్యర్థుల్లో టెన్షన్



ఆదోని, మే 15: ఆదోని ముస్లిం ఓటర్లు కీలకంగా ఉంటారు. ఈసారి వారంతా పార్టీలనకతీతంగా వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన సాయిప్రసాద్ రెడ్డిని బలపర్చారన్న ప్రచారం జరుగుతోంది. దీంతో మిగిలిన ఓటర్లలో కీలకంగా ఉన్న బీసీల ఓట్లు ఎటువైపు పడ్డాయన్న దానిపై ఇక్కడ గెలుపు ఆధారపడి ఉంది. బీసీ ఓట్లతోపాటు మిగిలిన సామాజిక వర్గాల ఓట్లలో అధికశాతం తమకే పడ్డాయని, గెలుపు పక్కా అని బీజేపీ నాయకులు విశ్లేషిస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు కలిసి పోలింగ్ శాతం గుణనీయంగా పెరిగిందని భావిస్తున్నారు. తొలిసారి ఓటు వినియోగించుకున్న వారి సంఖ్య కూడా ఈసారి భారీగా పెరిగింది. ఇవన్నీ ఎవరికి కలిసి వస్తాయన్న విశ్లేషణలు జోరుగా సాగుతున్నాయి. దీంతో ఆదోని నియోజకవర్గంలోని అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొంది.

అసెంబ్లీ స్థానానికి జరిగిన ఎన్నికల పోలింగ్‌లో పెద్దఎత్తున క్రాస్ ఓటింగ్ జరిగిందనే ప్రచారం జరుగుతోంది. దీనిపై వైసీపీ నాయకులు బయట ధీమాగా కనిపిస్తున్నా, లోలోన టెన్షన్‌తో సతమతమవుతున్నారు. దీంతో బూత్‌ల వారిగా పోలైన ఓట్లలో లాభనష్టాలను లెక్కిస్తూ క్రాస్‌ఓటింగ్‌పై అంచనాలు వేస్తున్నారు. విజయవకాశాలపై గ్రామాలు, మండలాల వారిగా పోస్టుమార్టం లెక్కలు కడుతున్నారు. పోలింగ్ రోజున గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్ల నాడిని పసిగట్టడంతో కొంత మేరకు సఫలమైనట్లు చెబుతున్నారు. కురువ సామాజిక వర్గానికి చెందినవారు ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజుకు ఓటు వేసినా, అసెంబ్లీకి వచ్చేసరికి వైసీపీ అభ్యర్థి సాయిప్రసాద్ రెడ్డికి క్రాస్ ఓటింగ్ జరిగిందని వైసీపీ నేతలు భావిస్తున్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికల కంటే 2024 ఎన్నికల్లో ఆదోని మండలంలోని ఓటర్లు మరింత మెజారిటీ వస్తుందని భావిస్తున్నారు. 2019లో 12,319 మెజారిటీ వచ్చిందని, 2024లో మెజారిటీ 50 వేలు పైగానే ఉంటుందని భావిస్తున్నారు. బీజేపీకి సీటు కేటాయించిన రోజే తన గెలుపు డిక్లేర్ అయ్యిందని వైసీపీ నేతలు అంటున్నారు. ఇదిలా ఉండగా, ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత, ఆదోనిలో భూకబ్జాలు, ఇసుక, మద్యం, రేషన్ మాఫియాలతో ఆదోని నియోజకవర్గం ప్రజలు విసిగి, వేసారి పోయారని, కొత్త వ్యక్తికి అవకాశం ఇస్తారని, అధికార పార్టీ ప్రలోభాలకు గురికాకుండా విజయాన్ని అందిస్తున్నారని ఎన్డీఏ కూటమి నాయకులు చెబుతున్నారు.

ప్రధాన పార్టీల మధ్యేపోటీ..

నియోజకవర్గంలో 10 మంది అభ్యర్థులు ఉన్నప్పటికీ ప్రధాన పార్టీలైన ఎన్డీఏ కూటమి, వైసీపీ మధ్యే పోటీ నెలకొంది. ఎన్డీఏ కూటమి బీజేపీ అభ్యర్థిగా డాక్టర్ పార్థసారధి, వైసీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి గెలుపుపై గట్టి ధీమాతో ఉన్నారు. కనిష్టంగా 50 వేలకు తగ్గకుండా మెజార్టీ వస్తుందని వైసీపీ నాయకులు భావిస్తుండగా, 20 వేలు పైనే మెజారిటీ వస్తుందని కూటమి అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఎవరి ధీమా వారిదే..

ఆదోని మండలంలో అధిక్యత మెజారిటీ వస్తుందని ఎన్డీఏ కూటమి నేతలు లెక్కలు వేస్తున్నారు. రైతులు, మహిళలు, వృద్ధులు, అన్ని వర్గాల ఓటర్లు బీజేపీని ఆదరించారని చెబుతున్నారు. దీంతో ఎన్డీఏ కూటమి శిబిరంలో రెట్టింపు ఉత్సాహం నెలకొంది. పట్టణంలో భారీ మెజారిటీ వస్తుందని కూటమి నేతుల భావిస్తున్నారు. వైసీపీ నేతలు డబ్బులు పంచడం, ఓటరు స్లిప్పులపై ఫొటో ముద్రించి ప్రచారం చేసినా ఓటర్లు వైసీపీకి ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పారని బీజేపీ అభ్యర్థి డాక్టర్ పార్థసారధి పేర్కొన్నారు.

పందేల జోరు

● రూ. లక్షలలో బెట్టింగ్ కాస్తున్న అనుచరులు, అభిమానులు

ఆలూరు, మే 15: మా అభ్యర్థి 15వేల మెజారిటీతో గెలుస్తాడని నాది రూ.లక్ష....!! అబ్బే మీ అభ్యర్థి ఓడిపోవడం ఖాయమని నాది రూ.2 లక్షలు.... కాదు..కాదు స్వల్ప మెజారిటీతో మా అభ్యర్థి గట్టెకుతాడు అంటూ మూడింతలు అంటూ నియోజకవర్గంలో రాజకీయ పందేలు జోరందుకున్నాయి. సోమవారం పోలింగ్ ముగియడంతో ఆయా పార్టీల అభ్యర్థుల గెలుపు ఓటములపై వారి అనుచరులు, అభిమానులు జోరుగా పందేలు కాస్తున్నారు. జూన్ 4వ తేదీ నాటికి బహిర్గతం కానున్న ఫలితాల వరకు పందేలు కొనసాగనున్నాయి.. మధ్యవర్తులు వారి నుంచి పెద్దఎత్తున కమిషన్లు ఆర్జిస్తున్నారు. నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున వీరభద్రగౌడ్, వైసీపీ నుంచి విరుపాక్షి పోటీ చేశారు. అయితే ఓటింగ్ మాత్రం పోటాపోటీగా జరగడంతో ఇరుపార్టీల అనుచరులు, అభిమానులు మాత్రం మనం గెలుస్తాం... అంటూ అభ్యర్థులకు భరోసా ఇస్తుండటంతో అభ్యర్థులు ఎన్నికల్లో నేనే గెలుస్తాను అనే ధీమాలో ఉన్నారు.. మెజారిటీ విషయంపై మాత్రం టీడీపీ, వైసీపీ పార్టీల నాయకులు ఎవరి అంచనాలు వారు వ్యక్తం చేస్తున్నారు. దీంతో పందేల జోరు కూడా పెరిగింది. మధ్యవర్తులు రూ. లక్షకు రూ.10 వేల చొప్పున కమిషన్ ఇవ్వాలని ధర నిర్ణయించారు..

● గుంతకల్లు టీడీపీ అభ్యర్థి జయరాంపై కూడా ఆలూరులో పందేలు...

ఆలూరు నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం వైసీపీను వీడి టీడీపీలో చేరి, అనంతతపురం జిల్లా గుంతకల్ నియోజకవర్గం నుంచి పోటీ చేయడంతో, ఆలూరు, గుంతకల్‌లో పందేల జోరు సాగుతుంది. గుంతకల్‌లో గెలిచి తీరుతానని జయరాం సవాల్ విసరడం.. ఆ సవాల్‌కు ప్రతి సవాల్‌ను వైసీపీ అభ్యర్థి వై వెంకటరామిరెడ్డి విసరడంతో ఆలూరు, ఆదోనిలో సైతం పందేలు సాగుతున్నాయి.



నాలుగు దశాబ్దాల తర్వాత స్వేచ్ఛగా ఓటు

● కడిమెట్ల పంచాయతీలో 83.10శాతం పోలింగ్ నమోదు



ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి స్వగ్రామంలో ఓటు వేసేందుకు నిలిచి ఉన్న ఓటర్లు

ఎమ్మిగనూరు, మే 15 : ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని కడిమెట్ల పంచాయతీలో నాలుగు దశాబ్దాల తర్వాత ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకున్నారు. కడిమెట్ల ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి స్వగ్రామం. ఈ పంచాయతీ పరిధిలో కడిమెట్లతో పాటు సిరాలదొడ్డి, ఎర్రకోట, రాళ్లదొడ్డి గ్రామాలు ఉన్నాయి. ఇక్కడ మొత్తం 7,693 ఓట్లు ఉండగా 6,980 ఓట్లు పోలై 83.10శాతం ఓటింగ్ నమోదైంది. ఆ గ్రామాల్లో చెన్నకేశవరెడ్డి ఏ పార్టీవైపు ఉంటే ఆ పార్టీవైపు ప్రజలు ఓట్లు వేయాల్సిందే. ఏనాడూ ఇతర పార్టీలకు రెండంకెల ఓట్లు పడిన దాఖలాలు లేవు. ఇతర పార్టీలకు చెందిన ఏజెంట్లు కూడా ఎవరు కూర్చునేవారు కాదు. చెన్నకేశవరెడ్డి ఏ పార్టీకి చెబితే ఆ పార్టీకి ఓటు వేసేవారు. ఇలా దాదాపు నాలుగు దశాబ్దాలుగా ఓటర్లు ఓటు వేస్తూ వచ్చారు. అయితే, ఈ సారి ఎన్నికలకు ముందు చెన్నకేశవరెడ్డి సమీపబంధువులు టీడీపీలో చేరడంతో ఆ నాలుగు గ్రామాల్లో ముమ్మరంగా టీడీపీ అభ్యర్థి గెలుపుకోసం వారు ప్రచారం చేశారు. అంతేగాక అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డిని కూడా ఒకసారి కడిమెట్లకు తీసుకెళ్లి ప్రజలకు పరిచయం చేశారు. అలాగే సోమవారం జరిగిన ఎన్నికల సందర్భంగా నాలుగు గ్రామాల్లో టీడీపీ తరఫున ఏజెంట్లు కూర్చున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో ఓటర్లు ఎన్నడూలేని విధంగా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వారు వేయాలనుకున్న పార్టీకి ఓటు వేశారు. దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత ఆయా గ్రామాల ఓటర్లు ఓటు వేయడంతో మిగతా ఓటర్లకు స్ఫూర్తినిచ్చినట్లయ్యింది.

కసితీరా ఓట్లు వేశారు

- ఎన్డీయే కూటమి విజయదుందుభి మోగించనుంది
- జూన్4న ముఖ్యమంత్రిగా చంద్రబాబు పీఠం ఎక్కనున్నారు
- మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి బీవీ



వడ్డె వీధిలో నాయకులతో సమావేశమైన బీవీ

ఎమ్మిగనూరు, మే 15 : అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వాన్ని ఓడించాలన్న కసితో కసితీర ప్రజలు ఎన్నికల్లో ఓటు వేశారని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆయా వార్డుల్లో పర్యటించి టీడీపీ ఇన్‌చార్జులు, కార్యకర్తలతో మాట్లాడారు. వార్డుల పరిధిలో ఉన్నబూత్‌ల్లో పోలింగ్ ఏవిధంగా జరిగింది.. ఎంతశాతం జరిగింది, స్థానిక కార్యకర్తలు ఎలా పనిచేశారు, ఓటర్లు ఎటువైపు మొగ్గుచూపారు అనే విషయాలపై చర్చించారు. ఎక్కడెక్కడ ఏఏ లోటుపాట్లు జరిగాయనే విషయాలను కూడా ఆరా తీశారు. ఈ సందర్భంగా వడ్డె వీధిలో కలిసిన ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలన్న కసితో ఓటు వేశారన్నారు. అలాగే ఓటింగ్‌శాతం కూడా పెరగడం అనేది కేవలం అధికార పార్టీపై ఉన్న వ్యతిరేకతతోనే అన్నారు. పోలింగ్ శాతం పెరగడం ప్రతిపక్షానికి అనుకూలం అన్నారు. ఎన్డీయే కూటమి విజయదుందుబి మోగిస్తుందన్నారు. జూన్ 4వ తేదీ ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయబోతున్నారన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు కటారి రాజేంద్ర, దేవేంద్ర, గుల్లా సలాం, లోకేష్‌నాయుడు, జగదీష్ ఆయా వార్డుల కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

మంత్రాలయంలో గెలుపు నాదే : రాఘువేంద్ర రెడ్డి

మంత్రాలయం, మే 15 : మంత్రాలయం నియోజకవర్గంలో ప్రతి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల్లో కష్టపడి పని చేశారని, గెలుపు పక్కా నాదేనని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి నాలుగు మండలాల కార్యకర్తలతో వేర్వేరుగా ఎన్నికల పోలింగ్‌పై సమీక్ష నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు తనకు అండగా నిలచి ఓటు వేశారని అన్నారు. ప్రతి మండలంలో టీడీపీ మెజార్టీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజలు వ్యతరేకతతో కసిగా పోలింగ్ బూతులకు తరలి వచ్చి ఓటు వేశారని తెలిపారు. సమావేశంలో రఘునాథ్ రెడ్డి, రామకృష్ణ రెడ్డి, రాకేష్ రెడ్డి, రాజా రెడ్డి, శివ, అడ్వకేట్ విజయకుమార్, చిదానందా, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి

స్వర్ణ రథంపై దర్శనమిచ్చిన ప్రహ్లాదరాయలు



స్వర్ణ రథంపై ఊరేగుతున్న ప్రహ్లదరాయలు

మంత్రాలయం, మే 15 : రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. బుధవారం వైశాఖ అష్టమిని పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో బృందావనానికి ప్రత్యేక పూజలు చేశారు. క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకం చేసి వెండి, బంగారు, పట్టు వస్త్రాలతో శోభాయమానంగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళ వాయిద్యాల మధ్య స్వర్ణ రథం పై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయులను అధిష్టించి అలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఉత్సవ మూర్తికి ఊంజలసేవ నిర్వహించారు. భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి విశేష పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మఠం పండితులు భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

ఈవీఎంలలో భవిత

ఆదోని, మే 15: పోలింగ్ ముగియడంతో అభ్యర్థుల ఓటు తీర్పు ఈవీఎంలలో భద్రంగా నిక్షిప్తమైంది. వారి రాజకీయ భవిష్యత్తు జూన్ 4వ తేదీన తేలనుంది. సోమవారం పోలింగ్ ముగియగానే ఈవీఎంలన్నింటికీ సీళ్లు వేసి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య కర్నూలు రాయలసీమ యూనివర్సిటీ స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. ఈవీఎంల రక్షణకు సాయుధ బలగాలను కాపలాగా పెట్టారు.

ఎమ్మిగనూరులో పెరిగిన పోలింగ్ శాతం

● పెరిగిన పోలింగ్ శాతం ఎవరికి కలిసొచ్చేనో..
● ఎవరి లెక్కలు వారివే

ఎమ్మిగనూరు, మే 15: నియోజకవర్గంలో గత ఎన్నికల కంటే ఈ సారి పోలింగ్‌శాతం స్వల్పంగా పెరిగింది. 2019 ఎన్నికల్లో 79.26శాతం పోలింగ్ నమోదుకాగా.. ఈ సారి ఎన్నికల్లో 81.97శాతం పోలింగ్ నమోదైంది. దీంతో ఈసారి 2.71 శాతానికి పెరిగినట్లయ్యింది. పెరిగిన ఓట్లు ఏ పార్టీకి కలిసిరానున్నాయోనని ప్రజలు చర్చించుకుంటున్నారు.

81.97శాతం పోలింగ్

ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 2,47,752 మంది ఓటర్లు ఉండగా 2,03,086 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో 81.97 శాతం పోలింగ్ నమోదైంది. ఎమ్మిగనూరు పట్టణంలో 83,432 మంది ఓటర్లు ఉండగా 61,856 మంది ఓటు వేశారు. దీంతో 74.14 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే మండలంలోని 32 గ్రామాల్లో 58,167 ఓట్లు ఉండగా 49,975మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో 85.92 శాతం నమోదైంది. నందవరం మండలంలో మొత్తం 47,287 ఓట్లు ఉండగా 40,957 ఓట్లు పోలయ్యాయి. దీంతో 86.61 శాతం, గోనెగండ్ల మండలంలో 58,866 ఓట్లు ఉండగా 50,298ఓట్లు పోలై 85.44 శాతం ఓట్లు నమోదయ్యాయి. ఎమ్మిగనూరు పట్టణంలో 80శాతం మేర పోలింగ్ నమోదు అవుతుదనున్నప్పటికి 74.14శాతం పోలింగ్ నమోదైంది. అయితే గత ఎన్నికలతో పోలిస్తే ఈ సారి పట్టణంలో 5శాతం ఓటింగ్ తక్కువగా నమోదైంది. ఇది ఎవరికి శాపంగా మారుతుందో..ఎవరికి వరంగా మారుతుందోనన్న చర్చి జరుగుతోంది. కాగా నియోజకవర్గంలో ఈసారి గ్రామీణ ప్రాంతాల్లో ఓటింగ్‌శాతం పెరగ్గా పట్టణంలో ఓటింగ్‌శాతం భారీగా తగ్గింది. నియోజకవర్గంలో 36 పోలింగ్ కేంద్రాల్లో 90కిపైగా పోలింగ్‌శాతం నమోదైంది. అత్యధికంగా గోనెగండ్ల మండలం నెరడుప్పల పోలింగ్ బూత్‌లో (262) 96.41శాతం పోలింగ్ నమోదు కాగా, ఎమ్మిగనూరు పట్టణంలోని 86వ పోలింగ్ బూత్‌లో అత్యల్పంగా 56.24 శాతం నమోదైంది.



ఎమ్మిగనూరు సోమప్ప సర్కిల్

అందరి దృష్టి ఆ గ్రామాలవైపే

ఎమ్మిగనూరు మండలంలో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, రాష్ట్ర వీరశైవలింగాయత్ కార్పొరేషన్ ఛైర్మన్ వై.రుద్రగౌడుకు పట్టున్న కడిమెట్ల, ఎర్రకోట, సిరాలదొడ్డి, రాళ్లదొడ్డితో పాటు గుడికల్లు గ్రామాల్లో ఈ సారి జరిగిన పోలింగ్ సరళిపై ప్రజల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. గతంలో ఈ గ్రామాల్లో ఏకపక్షంగా పోలింగ్ సాగేది. అయితే ఈ సారి ఈ గ్రామాల్లో ప్రత్యర్థి పార్టీకి కూడా ఏజెంట్లు కూర్చోవడంతో ఓట్లు ఎటు పడ్డాయని రాజకీయ వర్గాల్లో చర్చినియాంశంగా మారింది. ఈసారి ఎన్నికల్లో ప్రత్యర్థి పార్టీకి వర్గం ఏర్పడి ప్రచారం చేయడంతో ఆయా గ్రామాలపై ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, ఆయన తనయుడు జగన్మోహన్‌రెడ్డి ఓట్లు చేజార కుండా ప్రత్యేక దృష్టి సారించారు. అలాగే గుడికల్లు గ్రామంలో కూడా పట్టు నిలుపుకునేందుకు వై.రుద్రగౌడు కుటుంబ సభ్యులు సైతం గ్రామంలో తిష్టవేసి పరిస్థితిని సమీక్షించారు. ఈ సారి ఆయా గ్రామాలపై వారు పట్టునిలుపుకుంటారో లేదో వేచి చూడాల్సిందే.

ఎవరి లెక్కలు వారివే:

టీడీపీ, వైసీపీ నాయకులు గెలుపోటములపై ఎవరి లెక్కలు వారు వేసుకుంటూ టీడీపీ నాయకులు ఎమ్మిగనూరు పట్టణంలో ఓటర్లు తమ పార్టీకి అనుకూలంగా స్పందించారని, దీంతో పట్టణంలో పది నుంచి 15 వేల మెజార్టీ లభిస్తుందని, నందవరం మండలంలోను ఈసారి మంచి మెజార్టీ లభిస్తుందని లెక్కలేసుకుంటున్నారు. అలాగే గోనెగండ్ల మండలంలో ఓటర్లు తమవైపే మొగ్గుచూపారని తమకు మెజార్టీ రావొచ్చుని, ఎమ్మిగనూరు మండలంలో ఒకవేళ వైసీపీకి కాస్త అనుకూలంగా ఉన్నా మిగతా చోట్ల వచ్చే మెజార్టీతో విజయఢంకా మోగిస్తామని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ లెక్కలను వైసీపీ నాయకులు కొట్టి పారేస్తున్నారు. ఎమ్మిగనూరు పట్టణంతో పాటు ఎమ్మిగనూరు మండలం, నందవరం, గోనెగండ్ల మండలాల్లో తమకే మెజార్టీ వస్తుందని వైసీపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎవరిబలాబలాలు ఎంతమేర ఫలిస్తాయో జూన్4వ తేదీ వరకు వేచిచూడాల్సిందే.